క్లుప్తంగా

బాలాజీతండాలో ఎక్సైజ్‌దాడులు



సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'గుప్పుమంటున్న గుడుంబా' అనే శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మండలంలోని బాలాజీతండాకు చెందిన భూక్యా వీరు, గూగులోత్ గణేష్, మరో మహిళకు చెందిన గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి గుడుంబాను, 2బైక్‌లను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, 'ఒక్కరు మారినా చాలు' ఫౌండేషన్ ఫౌండర్ వాంకుడోతు గోపీనాథ్ శనివారం ఢిల్లీలో హర్యానా రాష్ట్రానికి చెందిన మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ అండ్ మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు వారు అందించిన గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు.

నియామకం



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులను ఎన్నుకున్నట్లు టీబీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్చి బిషప్ ఆర్.విక్రంపాల్ శనివారం తెలిపారు. సంయుక్త కోశాధికారిగా బిషప్ బి.యోహస్ నాయక్, మహబూబాబాద్ జిల్లా టీబీసీ అధ్యక్షులుగా కొనసాగుతున్న బిషప్ జీవీ.ఇశ్రాయేలును తెలంగాణ రాష్ట్ర ఈస్ట్ జోన్ టీబీసీ చైర్మన్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

ప్రశంస పత్రం అందజేత

చిన్నగూడూరు: 'ఆటవెలది' పద్య కవితకు పలువురు కవులు అభినందించి ప్రశంసపత్రం అందజేసినట్లు మండల కేంద్రానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు జక్కి నాగేశ్వర్ తెలిపాడు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వరంగల్ జిల్లా కవుల ఆధ్వర్యంలో శుక్రవారం హన్మకొండలోని అశోక కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'కవులు ప్రపంచానికి ఏమవుతారు' అనే కవితాంశంపై తాను రచించిన ఆటవెలది పద్య కవితకు పలువురు కవులచే ప్రశంసపత్రం అందకున్నట్లు తెలిపారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయండి

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి, కందికొండ గ్రామ శివారులోని కందగిరి పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

దంతాలపల్లి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా దంతాలపల్లి పరీక్ష కేంద్రాన్ని శనివారం తొర్రూరు ఆర్డీఓ గణేష్ సందర్శించారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ రవికుమార్ తెలిపారు.

కురవి: మండల కేంద్రంలోని రెండు, మోద్గుల గూడెం గ్రామంలోని హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కురవిలోని పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సునీల్‌రెడ్డి పరిశీలించారు.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిని కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా శనివారం నేలకొండపల్లి సీహెచ్‌సీ వైద్యబృందం సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని సదుపాయాలను పరిశీలించారు. ఆస్పత్రికి కావల్సిన వైద్యులు, వైద్యసిబ్బంది కొరతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు వరకుమారి, ఇందిర, గార్ల సీహెచ్‌సీ డాక్టర్ హనుమంతరావు, సీనియర్ నర్సులు స్వాతి, రాణి పాల్గొన్నారు.

ఇంటింటికి రాములోరి తలంబ్రాలు

- రూ.151 చెల్లించి ఆర్డర్ చేసుకునే వెసులుబాటు
- ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా భక్తులకు చేరవేత
- ఏప్రిల్ 6వ తేదీ వరకు బుకింగ్ చేసేందుకు అవకాశం



తలంబ్రాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం, ఆర్టీసీ అధికారులు, కార్గో సిబ్బంది

నెహ్రూసెంటర్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరిగే శ్రీరామనవమి వేడుకల్లో ఉపయోగించే తలంబ్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ తలంబ్రాలను శుభకార్యాల్లో అక్షింతలుగా వాడితే సాక్షత్తు రాములవారి ఆశీస్సులు, అనుగ్రహం ఉంటుందని భక్తుల నమ్మకం. దీనిలో భాగంగా భద్రాద్రి రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేసేందుకు మహబూబాబాద్ ఆర్టీసీ కార్గో సేవలను అందిస్తుంది. ఆర్టీసీ ద్వారా బుకింగ్ చేసుకున్న భక్తులకు రాములోరి తలంబ్రాలను అందజేయనున్నారు. భక్తులు రాములోరి తలంబ్రాలను అందించేందుకు బుకింగ్స్ ప్రారంభించగా బుకింగ్ చేసుకున్న వారికి కార్గో సిబ్బంది రాములోరి తలంబ్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు.

కల్యాణానికి వెళ్లలేని భక్తుల కోసం..

భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో తలంబ్రాలను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రూ.151 చెల్లించి తలంబ్రాలను బుకింగ్ చేసి పేరు నమోదు చేసుకున్న భక్తులకు ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో సిబ్బంది స్వయంగా ఇంటికే తెచ్చి అందిస్తున్నారు. జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, కురవి, ఇనుగుర్తి, బయ్యారం, బరిపెడ బంగ్లా, ఇతర మండలాల్లో నుంచి బుకింగ్స్ రాగా రాములోరి తలంబ్రాలను పంపిణీ ప్రారంభించారు.

తలంబ్రాలను భక్తులకు ఆర్డర్‌పై అందించేందుకు మార్చి30 వరకు అవకాశం ఉండగా భక్తుల నుంచి వస్తున్న స్పందన ద్వారా ఏప్రిల్ 6వ తేదీ వరకు అవకాశం ఉంది. బుకింగ్స్ చేసుకున్న వారికి పండుగ తరువాత వారం రోజుల్లో ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటింటికి అందజేయనున్నారు.

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



సీతారామ కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తులు ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా రూ.151 చెల్లించి పేరు నమోదు చేసుకుని తలంబ్రాలను పొందవచ్చు. భక్తుల నుంచి వస్తున్న ఆర్డర్ల మేరకు ఏప్రిల్ 6వ తేదీ వరకు ఆర్డర్ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎం.శివప్రసాద్, ఆర్టీసీ డీఎం, మహబూబాబాద్

పోస్టర్ల ఆవిష్కరణ...

తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్న వారికి కార్గో ద్వారా అందజేస్తామని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. ఈమేరకు డిపోలో కార్గో ద్వారా తలంబ్రాలను అందజేయనున్న పోస్టర్లను అవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్ కోసం 91542 98768, 91004 77150, 79890 58716, 91214 44477 నంబర్లకు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి సారంగం

చిన్నగూడూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్య పెంచాలని మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ సారంగం పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఎమ్‌సీహెచ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ సారంగం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్‌లు జరగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్‌లు, డెలివరీల సంఖ్యను పెంచాలని తెలిపారు. పీహెచ్‌సీలో నమోదైన డెలివరీ కేసుల రికార్డులను పరిశీలించి స్టాఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఈ రాజు, సీహెచ్‌ఓ వలీఉద్దీన్, హెచ్‌వీ రాధాకుమారి పాల్గొన్నారు.

రైతులకు బిల్లు ఇవ్వాలి

మరిపెడ రూరల్: వచ్చే వానకాలం సీజన్ వరకు ప్రతి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ షాపుల యాజమానులు బిల్ బుక్ మెంటన్ చేయాలని, రైతులకు తప్పనిసరి బిల్ ఇవ్వాలని మరిపెడ వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్ సూచించారు. శనివారం మండలంలోని గిరిపురం రైతువేదికలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాలం శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల కృష్ణ, హరీశ్, సురేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

గూడూరు: జీపీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ వీరస్వామికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎండీ. మోహినోద్దీన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు రావడానికి రాష్ట్ర సంఘం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనున్నట్లు తెలుపుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణగా షీటీం



మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులకు, మహిళలకు రక్షణగా షీటీం ఉంటుందని షీటీం ఎస్సై సునంద అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళల ఫార్మసీ కళాశాలలో శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. సోషల్‌మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు చేసుకోవద్దని, వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీనంబర్ 1930, షీటీం వాట్సాప్ నంబర్ 87126 56935 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి, భరోసా సెంట్రల్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, జయశ్రీ, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం, గుడుంబా

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల కురవి మండలంలోని చెర్లతండా, బయ్యారం మండలంలోని చుంచుబంధంతండా, గార్ల మండలంలోని బాలాజీతండా, మహబూబాబాద్ మండలంలోని కంబాలబండ తండాల్లో శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి అన్నారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, జిల్లా టాస్క్ ఫోర్సు టీంలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో నిర్వహించడం జరిగింది. 78లీటర్ల సారాయి, 50కిలోల బెల్లం, 30కిలోల పటిక స్వాధీనం చేసుకుని, 3ద్విచక్రవాహనాలను సీజ్ చేసి, 300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 12మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు మౌనిక, కిరీటి, హెడ్ కానిస్టేబుళ్లు మధు, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు యాదగిరి, రాజు, శేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

క్లబ్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. పార్టీ పట్టణ సమితి సమావేశం శనివారం పార్టీ కార్యాలయంలో నవీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో గల విశాలమైన ప్రభుత్వ ఓసీ క్లబ్‌ను ప్రజా అవసరాల కోసం వినియోగించాలని, ఓసీ క్లబ్ ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్ అని పేర్కొన్నారు. క్లబ్ భూమిపై సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశామని, కలెక్టర్, అధికారులు దృష్టికి తీసుకువచ్చేందుకు ఈనెల 24వ తేదీన సీపీఐ చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, వెలుగు శ్రావణ్, ఎండీ. ఫాతిమా, ఆబోతు అశోక్, నాగెల్లి యాకమ్మ, పురం భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని జయించాడు..

- శస్త్ర చికిత్స అనంతరం నడుస్తున్న లక్ష్మణ్
- సాధారణ స్థితికి చేరుకున్న యువకుడు
- భరోసా కల్పించిన మరిపెడ భవిత కేంద్రం



గతంలో దివ్యాంగుడు లక్ష్మణ్



ప్రస్తుతం నిర్వాహకులతో లక్ష్మణ్..

మరిపెడ రూరల్: ఓ దివ్యాంగుడు అంగవైకల్యాన్ని జయించాడు. పుట్టుకతో (కంజెనిటల్) డిజార్డర్ బారిన పడి 20 ఏళ్లుగా చేయి, కాలు సరిగా లేక కర్ర సాయంతోనే కదిలాడేవాడు. ఈ క్రమంలో భవిత కేంద్రం (పిల్లల ప్రత్యేక అవసరాల కేంద్రం) భరోసాతో నేడు అంగవైకల్యంపై విజయం సాధించాడు. కర్ర సాయం సాయం లేకుండా నిలబడుతున్నాడు. అతడే మహబూబబద్ జిల్లా మరిపెడ మండలం బావోజిగూడెం గ్రామానికి చెందిన మిడతపల్లి లక్ష్మణ్. 2005లో జన్మించిన లక్ష్మణ్ పుట్టుకతోనే దివ్యాంగుడు. తల్లి వీరమ్మ తాపీ పని చేస్తూ కుమారుడిని పోషించుకునేది. కుమారుడి అంగవైకల్యాన్ని బాగు చేయించాలనే లక్ష్యంతో తల్లి ఎన్నో ఆస్పత్రులు చుట్టు తిరిగింది. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో విసిగి వేసారి చేసేది లేక 2014లో మరిపెడ మండల కేంద్రంలోని భవిత వనరుల కేంద్రంలో లక్ష్మణ్ తన పేరు నమోదు చేయించుకున్నాడు. భరోసా కేంద్రం సిఫారస్ మేరకు అంగవైకల్యాన్ని జయించాలనే లక్ష్మణ్ లక్ష్యాన్ని చూసిన ఏపీలోని తిరుపతికి చెందిన 'బర్డ్స్' ఆస్పత్రి యాజమాన్యం సమస్యను పరిశీలించింది. 2016లో ఆర్థోపెడిక్ చికిత్స చేయడం ప్రారంభించింది. అనంతరం అదే ఏడాది కాళ్లకు శస్త్ర చికిత్స, 2025లో మరోసారి శాస్త్ర చికిత్స చేశారు. దీంతో అప్పటి వరకు కర్ర సాయంతో నడిచిన లక్ష్మణ్.. ప్రస్తుతం కోలుకుని ఏ సాయం లేకుండా నడుస్తున్నాడు. కాగా, తాను దివ్యాంగుడి నుంచి సాధారణ స్థితికి రావడానికి సహకరించిన మరిపెడ విద్యావనరుల కేంద్రం, భవిత వనరుల కేంద్రం, తిరుపతి ఆస్పత్రి నిర్వాహకులకు లక్ష్మణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు.

జమిలి ఎన్నికలతో పాలనలో సుస్థిరత

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి



మాట్లాడుతున్న కేవీఎల్ఎన్‌రెడ్డి

తొర్రూరు: జమిలి ఎన్నికలతో పాలనలో సుస్థిరత వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి అన్నారు. వన్‌నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని కిరాణా మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. చెన్నోజు విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేవీఎల్ఎన్ రెడ్డి మాట్లాడారు. జమిలి ఎన్నికలతో ప్రజా ధనం, ప్రభుత్వ కార్య నిర్వహణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. దేశం పటిష్టంగా ఉండాలంటే ఒకే దేశం-ఒకే ఎన్నిక అవసరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దశమంతరెడ్డి, లేగా రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మోడెపల్లి సోమన్న, రచ్చ కుమార్, పైండ్ల రాజేష్, గట్టు రాంబాబు, సాయిని ఝాన్సీ, నిమ్మల సంపత్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

నీరు ఉంటేనే జీవకోటి మనుగడ



మహబూబాబాద్ అర్బన్: ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సభ్యులు



తొర్రూరు రూరల్: అరిపిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు



పెద్దవంగర: చిట్యాలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, ప్రతినిధులు



దంతాలపల్లి: దాట్ల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ సభ్యులు

ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నీరు ఉంటేనే జీవకోటి మనుగడ సాధ్యమని, ప్రతీ నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

- మహబూబాబాద్ అర్బన్/తొర్రూరు/తొర్రూరు రూరల్/దంతాలపల్లి/పెద్దవంగర

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కాలు విరిగి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మాటేడు గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్‌కు చెందిన పున్నం చందర్ తన బైక్‌పై దంతాలపల్లి నుంచి వరంగల్ వైపు వస్తూ ముందు వెళ్తున్న లారీని దాటేందుకు ప్రయత్నించగా ఎదురుగా వస్తున్న కారును బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న పున్నం చందర్ కాలు నుజ్జునుజ్జు కావడంతోపాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వరంగల్ 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

సంక్షిప్త సమాచారం

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం: డీటీఎఫ్ కేసముద్రం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం మండల అధ్యక్షుడిగా కీర్తి నాగయ్య, ప్రధాన కార్యదర్శి దేవరాజు మల్లేశం, జిల్లా కౌన్సిలర్‌లుగా బీముడు, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అందించిన రాజీవ్ యువ వికాస పథకాన్ని యువకులతోపాటు యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా వైస్ చైర్మన్ భూక్య పద్మ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడారు.

ఇఫ్తార్ విందు



గూడూరు: మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం రాత్రి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, ఖదీర్, కరీం, సలీం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గూడూరు: మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల పరిషత్ అధికారి వీరస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, ముక్తవరం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ పరిశీలన

దంతాలపల్లి: వేసవిలో ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు తప్పనిసరి సస్యరక్షణ చర్య తీసుకోవాలని తొర్రూరు డివిజన్ ఉద్యానవన అధికారి మానస అన్నారు. మండలంలోని గున్నెపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్, అఖిల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన

నెల్లికుదురు: సికిల్ సెల్ ఎనిమియాపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి రమ్య కోరారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం జిల్లా లెవెల్ టీఓటీ శిక్షణ జాతీయ సికిల్ సెల్ ఎనిమియాపై ఏఎన్ఎంలు, ఆశలకు అవగాహన కల్పించారు.

మహిళపై కేసు నమోదు

డోర్నకల్: రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనం నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న రాజుతండాకు చెందిన బానోత్ శిరీష విధుల్లో ఉన్న బ్లూకోట్ కానిస్టేబుల్ నరేష్‌తో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో నరేష్ ఫిర్యాదు మేరకు శిరీషపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ శనివారం తెలిపారు.

కంటి అద్దాల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం శనివారం విద్యార్థినులను పరీక్షించి కంటి అద్దాలను డాక్టర్ రమ్య, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నెల్లికుదురు: కేసముద్రం మండల కేంద్రంలో ఈనెల 11న దళితుడైన బిర్రు సందీప్‌పై దాడి చేసిన పడాల రాజును తక్షణమే అరెస్టు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు హెచ్.అశ్విన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు.

పాలాభిషేకం

నెల్లికుదురు: పట్టువదలని విక్రమార్కుడిలా అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే వరకు పోరాడిన యోధుడు మందకృష్ణ మాదిగ అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల వెంకన్న మాదిగ అన్నారు. ఈసందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో శనివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, ఐలయ్య, వెంకటేష్, యాలాద్రి, హరీష్, మురళి, అశోక్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటం

కురవి: భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కొలిపాక వీరేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముందస్తుగా భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొక్కజొన్న ట్రాలీ ఆటో బోల్తా..

కురవి: మక్కల లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో పక్కకు ఒరిగిన సంఘటన మండలంలోని మొగిలిచర్ల గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. మక్కలను(మొక్కజొన్న) లోడు చేసుకుని మానుకోట వైపు వెళ్తుండగా ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయింది. దీంతో ట్రాలీ ఆటో అదుపు తప్పి పక్కకు ఒరిగింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

నిధుల మంజూరుకు కృషి

తొర్రూరు: బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించడం హర్షణీయమని బోప్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి విదేశీ విద్యా నిధుల మంజూరుకు కృషి చేసిన సుధాకర్‌ను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు ఓలేటి లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు అలహరి శ్యాంసుందర్, రాము, ఓలేటి వెంకన్న పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నెల్లికుదురు: పోటీ పరీక్షల్లో విజయ లక్ష్యాల కోసం ప్రతి ఒక్క విద్యార్థి పోటీపడి చదవాలని అప్పుడే అనుకున్న స్థాయికి చేరుతారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ద్వారా పాలిటెక్నిక్ జూనియర్ కాలేజీ ఎంట్రన్స్ పరీక్షల స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇంజనీర్ జయకృష్ణ, యుగేందర్, లక్ష్మణ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగామకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

బయ్యారం: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని ఏజెన్సీ గౌడ్ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు ఉమ్మగాని సత్యంగౌడ్, మండా రాజన్న గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రమేష్, వినయ్, సారయ్య, రవి, నారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: భూతగాదా విషయంలో జరిగిన ఘర్షణ కారణంగా ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ సీఐ వి.దీపిక శనివారం తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో గల భూమి విషయంలో 10వ వార్డు మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనుకు మరికొంతమందికి మధ్య వాగ్వివాదం, ఘర్షణ చోటుచేసుకుందని పేర్కొన్నారు. భూక్య శ్రీను, అతడి కుటుంబ సభ్యులకు అక్కడ భూమి ఉందని, అది తమకే చెందాలని మాట్లాడుతున్న క్రమంలో జే.ప్రమోద్ రెడ్డి, వీరన్న, పూర్ణచందర్ ముగ్గురు వ్యక్తులు అతడిని కులం పేరుతో దూషించారని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో ప్రమోద్ రెడ్డి, వీరన్న, పూర్ణచందర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశామని వివరించారు.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: రైళ్లలో అక్రమంగా తరలిస్తున్న 210 కిలోల నల్లబెల్లం, 10కిలోల పటిక, ఎనిమిది లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్ ఫోర్సు సీఐ నీరజ శనివారం తెలిపారు. కొందరు రైలు బోగీల్లో నుంచి బెల్లం బస్తాలు, పటిక బస్తాలను కిందపడ వేస్తున్నట్లు గుర్తించామన్నారు. నల్లబెల్లం, పటిక పట్టివేత ఘటనలో కేసముద్రం మండలం బడితండాకు చెందిన బదావత్ శంకర్, కేసముద్రంకు చెందిన మాలోతు బాలాజీ, బానోత్ హచ్చి, కొల్లాపురం గ్రామ శివారు గండి తండాకు చెందిన నూనావత్ నంద్యపై కేసు నమోదు చేశామన్నారు. 210కిలోల నల్లబెల్లం, 10కిలోల పటిక, ఎనిమిది లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని, ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైళ్లు సీజ్ చేశామని తెలిపారు.

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో..

విశాఖపట్నం నుంచి హజరత్ నిజాముద్దీన్ వైపునకు వెళ్తున్న లింక్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న పది బస్తాల నల్లబెల్లం పట్టుకుని జిల్లా పోలీసు శాఖ టాస్క్ ఫోర్స్ అధికారులకు అప్పగించామని ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని తెలిపారు. కేసముద్రం మండలంలోని కోమటిపల్లి గ్రామ శివారు బాపూజీ తండాకు చెందిన సపావట్ సంతోష్, బడితండాకు చెందిన బానోత్ మోహన్ నల్ల బెల్లం తీసుకువచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు.